క్లుప్తంగా

సంఘం అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు : సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని టీసీసీ అధ్యక్షుడు జాన్సన్ తెలిపారు. మంగళవారం వైఎంఆర్ కాలనీలోని టీసీసీ చర్చిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డితో కలిసి చర్చిస్తామన్నారు. సమావేశంలో డీసీ సునీల్ బాబు, అగస్టీన్ రాజు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని దొరసానిపల్లెలోని గురూజీ హైస్కూల్‌లో మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా కన్వీనర్‌గా మాదాసు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస ఆచారి, కార్యదర్శిగా సుబ్బరాయుడు, సంయుక్త కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు, వెంకటేష్, రాజా, ప్రతాప్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



శ్యాంసుందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నాయకులు

అట్లూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల శ్యాంసుందర్‌ను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా మంగళవారం ఆయన నివాసంలో పరామర్శించారు. మత్తుకూరు సర్పంచు మీసాల పద్మకుమారి భర్త మీసాల శ్యాంసుందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి రాయ్‌వేలూరులో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు అడా చైర్మన్ సింగసాని గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ పుత్తా రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, మున్సిపాలిటీ కన్వీనరు ఈగా యద్దారెడ్డి, సచివాలయాల మండల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఆయనను పరామర్శించారు.

ఇసుక తరలింపునకు అడ్డుకట్ట

చాపాడు : రేయింబవళ్లు తరలిస్తూ తమను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ మండలంలోని వెదురూరు గ్రామస్థులు ఇసుక తరలిస్తున్న టిప్పర్లను మంగళవారం అడ్డుకున్నారు. గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఏడు టిప్పర్లలో ఇసుక తరలిస్తున్నారని వారు ఆరోపించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఈడీ సీఐ మోహన్‌రెడ్డి, చాపాడు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. గత కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా పలు ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్థులు తెలిపారు.

ఆక్రమణలు తొలగించిన రెవెన్యూ అధికారులు

పోరుమామిళ్ల : పట్టణ శివారులో (మైదుకూరు రోడ్డు) రంగసముద్రం పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 1190లో నిర్మించిన కట్టడాలను మంగళవారం సాయంత్రం తహసీల్దారు గంగయ్య, ఆర్ఐ సుధాకర్‌రెడ్డిలు రెవెన్యూ సిబ్బందితో వెళ్లి జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 1190 లో 66 సెంట్లు ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నారన్నారు. ఇది ప్రభుత్వ భూమి అని, వాగు పోరంబోకు అని, రికార్డులో చుక్కలభూమిగా ఉందన్నారు. ఈ భూమికి సంబంధించి ఎవరికీ పట్టా ఇవ్వలేదన్నారు. అక్రమ కట్టడాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించామన్నారు. నిర్మాణాలు జరిపిన వారిని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఆక్రమణలు జరిగిన ప్రాంతంలో సెంటు స్థలం విలువ రూ. 10 లక్షలు ఉన్నట్లు సమాచారం.

ఆప్‌కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా భాస్కర్‌రెడ్డి



బ్రహ్మంగారిమఠం: మండలంలోని మలుగుడుపాడు గ్రామానికి చెందిన అంబవరపు భాస్కర్‌రెడ్డిని ఏపీసీఓఎస్(ఏపీ కార్పొరేషన్ అవుట్ సోర్స్‌డ్ సర్వీస్‌ఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వసతులు కల్పించాలని ధర్నా

మైదుకూరు : పట్టణంలోని వీణా విజయరామరాజు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా విజ్ఞప్తులు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుచేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్రకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు పి.శ్రీరాములు, ఏవీ.శివరాం, పి.భాస్కర్, బీవీ.శ్రీనివాసులు, షావలి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- కార్పొరేట్‌కు దీటుగా మారిన రూపురేఖలు
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు





వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్

ప్రొద్దుటూరు కల్చరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పటిష్టమైన విద్యాబోధనకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తలచిన వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం .. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యారంగంలో సమూల మార్పులు చేసింది. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలను కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశారు. ప్రభుత్వ పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపొందించి విద్యాబోధన అందిస్తున్నారు. ప్రొద్దుటూరు మండలంలో మొదటి విడతగా 38 పాఠశాలలు నాడు–నేడుకు ఎంపిక చేసి రూ.9,07,89,800 నిధులతో పనులు పూర్తి చేశారు. వీటిలో 6 హైస్కూళ్లు, 6 యూపీ, 26 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. రెండో విడతలో 66 పాఠశాలలు, 2 జూనియర్ కళాశాలల్లో రూ.21,40,18,000లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వీటిలో 13 హైస్కూల్‌లు, 4 యూపీ, 47 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి.

విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు

నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో సురక్షిత మంచి నీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు, బల్లలు, కుర్చీలు, ల్యాబ్‌లు, గ్రంథాలయాల ఏర్పాటు, గ్రీన్‌చాక్ బోర్డు, విద్యుదీకరణ, ప్రహరీ నిర్మాణం, పెయింటింగ్ చేసి పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే 8వ తరగతి విద్యార్థులకు, బైజూస్ కంటెంట్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. వీటితో పాటు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక ద్వారా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, బూట్లు, బెల్టు, అందజేస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి మెనూలో మార్పులు చేసి రుచికరమైన భోజనాన్ని వడ్డిస్తున్నారు. రక్తహీనతను నివారించడానికి ఫోర్టిఫైడ్ బియ్యం, రాగిజావ, చిక్కీలు, గుడ్లు పంపిణీ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టడంతో పెద్దసంఖ్యలో విద్యార్థులు చేరుతున్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఇద్దరు మున్సిపల్ పాఠశాలల విద్యార్థినులు 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి చరిత్ర సృష్టించారు. అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు లబ్ధి కలుగుతుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వం తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా 3వ తరగతి నుంచే విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్‌లతో విద్యాబోధన కొనసాగిస్తోంది.









వంట గది

బెంచీలు

నేడు ఎస్‌జీఎఫ్ఐ పోటీలు

దువ్వూరు : మండలంలోని చల్లబసాయపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలోని క్రీడా ప్రాంగణంలో ఈ నెల 13, 14వ తేదీల్లో ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ప్రతాప్ తెలిపారు. 13న మండల స్థాయిలో అండర్–14, 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగాపోటీలు నిర్వహిస్తామన్నారు. 14న అథ్లెటిక్స్ నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు వారి పాఠశాలల నుంచి అర్హత దరఖాస్తులతో పాటు స్టడీ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

జూదరుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని దొరసానిపల్లెలో పేకాట ఆడుతున్న 14 మందిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. తమకు వచ్చిన సమాచారం మేరకు రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్‌లు సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. దాడిలో 14 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 90 వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దువ్వూరు : ఈ నెల 14న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ సభా భవనంలో జరిగే ఈ సమావేశానికి మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహరిన్శలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని ఎమ్మెల్యే కోరారు. మండలంలోని గంజికుంట పంచాయతీ లెక్కలవారిపల్లెలో ఆయన మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లెక్కల శివప్రసాద్‌రెడ్డి, లెక్కల వెంకటరెడ్డి, లెక్కల రామ్మోహన్‌రెడ్డి, ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, శెట్టిపల్లె నాగిరెడ్డి, శ్రీమన్నారాయణరెడ్డి, గల్లా నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్ర బాబు, గౌస్‌లాజం, ఎం.శ్రీనివాసులు రెడ్డి, జేష్టాది రవి పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

రాజుపాళెం : రాజుపాళెంలోని ఎంపీడీఓ సభాభవనంలో బుధవారం జరగనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజుతోపాటు జేసీ గణేష్ కుమార్, జిల్లా అధికారులు రానున్నారన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారులకు తెలుపుకోవచ్చునని, ఇప్పటికే ఆయా గ్రామాల్లోని అధికారులు ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరారాణి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, మండల ఆర్ఐ అశోక్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

జాబ్ ఓరియంటేషన్ స్కిల్స్‌పై శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉచితంగా జాబ్ ఓరియంటేషన్, కమ్యూనికేషన్, సాఫ్ట్, టెక్నికల్ స్కిల్స్‌పై ఆరు రోజుల శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగరాజు మాట్లాడుతూ నాంది ఫౌండేషన్, ఏపీఎస్‌ఎస్‌డీసీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజుకు 6 గంటలు చొప్పున ఆరు రోజులు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు చదువులో చాలా చురుకుగా ఉన్నా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో వెనుకబడి ఉన్నారన్నారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో పురోగతి అవడమే కాకుండా 100 శాతం ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.హరినాథరెడ్డి, కళాశాల డీన్ కేవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి



ఆహా క్యాంటిన్ ప్రారంభోత్సవంలో మెప్మా పీడీ సురేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు : మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని మెప్మా పీడీ సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో డ్వాక్రా మహిళలు నూతనంగా ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత లాంటి పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడుతున్నారన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఈ కెజియా జాస్లిన్, సీఓలు ఆర్పీలు పాల్గొన్నారు.

సేవాశ్రమానికి గానుగపెంట పురస్కారం

గోపవరం : వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, రామతులసి దంపతులకు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు సాహిత్య కళాపీఠం నాల్గవ పురస్కారం ఈ నెల 16న వివేకానంద సేవాశ్రమంలో ప్రదానం చేస్తున్నట్లు గౌరవాధ్యక్షుడు జింకా సుబ్రమణ్యం తెలిపారు. కాశినాయన మండలం ఓబుళాపురం నగిలేరు ఒడ్డున ప్రకృతి రమణీయత ప్రతిబింబిస్తున్న వివేకానంద సేవాశ్రమంలో ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హనుమంతరావు 77వ జయంతి జన్మదినం సందర్భంగా నగదు, జ్ఞాపిక, సేవాధురణి బిరుదుతో ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. గత 12 సంవత్సరాలుగా అనాథల జీవితాలలో వెలుగు నింపుతూ నిస్వార్థ సేవ చేస్తున్న రామకృష్ణారెడ్డి, రామతులసి దంపతులను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం : ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సీ.వీరనారాయణరెడ్డి అధికారులను కోరారు. పలు గ్రామాల నుంచి వచ్చిన వినతులపై ఆయన స్పందిస్తూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విని తక్షణమే స్పందిస్తే వారు తిరిగి వెళ్లి పనులు చేసుకుంటారన్నారు. తహసీల్దారు, ఉప తహసీల్దారు ఆయా గ్రామాల సచివాలయాల్లో ఉన్న వీఆర్వోలకు ఆదేశాలివ్వాలన్నారు. వినతులను జిల్లా అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వరికుంట్లలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రగతితో పాటు అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో గల శివరామకృష్ణనగర్, రిక్షా కాలనీలలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాల్లో ఎక్కడా కోత విధించకుండా ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి తాము వార్డుల్లో ధైర్యంగా తిరిగే హక్కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, ఆర్.వి.సాయిక్రిష్ణ, మున్సిపాలిటీ కన్వీనర్ ఎద్దారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు దుద్దుకూరు సత్యం, ప్రతాప్‌కుమార్, రాజాయాదవ్, సంటెయ్య, రమణారెడ్డి, వేణు, జయరామ్, రమణ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అందరికీ పథకాలు

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వరికుంట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. లబ్ధిదారులకు ఇప్పటి వరకు చేకూరిన పథకాల లబ్ధిని పొందుపరిచిన బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలు, కులాలు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ద్వారా తెలియజేయాలని సూచించారు. కొంత మంది సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యారెడ్డి, ఎంపీడీఓ మైథిలి, ఈఓపీఆర్డీ ముజఫర్ రహీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

చాపాడు : మండలంలోని ఎన్.ఓబాయపల్లెలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. నక్కలదిన్నె, దళిత వాడ, అనంతపురం గ్రామాల్లో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని ఎంపీపీ తెలిపారు.

మాచనపల్లెలో..

దువ్వూరు : మండలంలోని మాచనపల్లె గ్రామంలో బుధవారం ఉదయం ఏడు గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరవుతారర్నొన్నారు.

కార్మికశాఖలో అక్రమాలు

టీడీపీ హయాంలో స్కాంను వెలికితీయాలి : బూసిపాటి కిశోర్

కడప కార్పొరేషన్ : టీడీపీ హయాంలో కార్మిక శాఖలో అక్రమాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ నాయకుడు బూసిపాటి కిశోర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కంటే ఇది పెద్ద కుంభకోణమన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందుల కొనుగోలు విషయంలో అవినీతి జరిగిందన్నారు. మందుల ధరలను నాలుగు రెట్లు పెంచుకుని అవినీతికి పాల్పడ్డారని, తమ కమీషన్ల కోసం నాణ్యత ని పరికరాలు కొనుగోలు చేశారని ఆరోపించారు. బినామీ ఏజెన్సీలతో మందులు కొనకపోయినా బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. ఈ అక్రమాల వెనుక అప్పటి మంత్రులు అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణ ఉన్నారన్నారు. హైదరాబాద్‌లోని నారా లోకేష్‌కు సంబంధించిన ఏజెన్సీ పేరుతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని, అవినీతి వెనుక చంద్రబాబు హస్తం ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో ఈఎస్ఐ అక్రమాలపై తూతూ మంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకొన్నారన్నారు. విచారణ చేపట్టి కార్మికుల సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు కార్మిక మంత్రి గుమ్మనూరు జయరాం, కేంద్ర కార్మికశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు అవసరం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

కలసపాడు : శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంఈఓ–2 మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే క్రీడా పోటీలను ఎంఈఓ ప్రారంభించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారు బద్వేలులో జరిగే జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలిని, స్కూల్ గేమ్స్ మండల కో–ఆర్డినేటర్ సుమన్, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, సురేష్, రమాదేవి, వాణి, సోమల మేరీ, వినీత్, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అట్లూరులో ఎస్జీఎఫ్ క్రీడలు

అట్లూరు : మండలంలోని అట్లూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా జరిగాయి. ఈ క్రీడల్లో అట్లూరు, సోమేశ్వరపురం, కమలకూరు ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ పాఠశాల నుండి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారి విలియం రాజు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఫణిశ్రీ, అట్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అశ్వర్థరెడ్డి, మండల నాయకులు రెడ్డెయ్య, నరసింహులు జ్యోతిప్రజ్వలన చేసి మేజర్ ధ్యాన్‌చంద్, భారత వ్యాయామ ఉపాధ్యాయ పితామహులు హ్యారీక్రోబక్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మండల స్కూల్ గేమ్స్ క్రీడల కన్వీనర్ రమేష్‌యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్, ఓబయ్య, ప్రమీల, విద్యాధర్, శ్రీదేవి, చంద్రకళ, బాలసుందరం, సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సావిత్రమ్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. మండలంలోని తాళ్లమాపురం జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలబాలికల ఖోఖో, కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు పోటీతత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. నిత్యం క్రీడా సాధన చేసి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోపినాథరెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. కార్యక్రమంలో తాళ్లమాపురం సర్పంచ్ మాచిరెడ్డి కొండారెడ్డి, ఉపసర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ అన్నపురెడ్డి మహేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు నడిగడ్డ సుధాకర్, ప్రసాద్‌రెడ్డి, ఓబయ్య, లక్ష్మీదేవి, శ్యాముల్, ఉషారాణి, మాధవిలత పాల్గొన్నారు.

డ్రోజర్ ట్రాక్టర్ దగ్ధం: డ్రైవర్‌కు అస్వస్థత!



మంటలు రేగి కాలిపోతున్న ట్రాక్టర్ దోజర్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మదిరెడ్డిపల్లెకు చెందిన బోగిరెడ్డి బాలిరెడ్డికి చెందిన డ్రోజర్ ట్రాక్టర్ మంగళవారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. డ్రోజర్‌లో అకస్మాత్తుగా మంటలు రావడంతో యజమాని బాలిరెడ్డి వాహనం నుంచి కింద పడి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో కడప ఆసుపత్రికి తరలించారు. షోరూంలో సర్వీసింగ్ చేయించి మంగళవారం పోలేరమ్మ గుడి వద్ద పొలంలో పనిచేస్తుండగా మంటలు రేగినటుల బాధితుడి కుటుంబీకులు తెలిపారు.